8

# గులాబి పువ్వు వైద్యం

ప్రతి గురువారం ఓ గులాబిపువ్వుని భాగ్యనగర్ అపార్టుమెంట్‌లోని, మూడో అంతస్తులో మూలఫ్లాటులో వున్న సంధ్యక్కకి ఇస్తూంటాను.

కరెంటుపోయి చీకటిగా వున్నాసరే, వర్షం వచ్చినా సరే పువ్వును ఆమెకి ఇస్తూంటాను.

అది బెస్ట్ పువ్వు. అరచెయ్యంత సైజులో వున్న పసుప్పచ్చని గులాబి, దానికి ఓ పొడుగు కాడ, అటూ ఇటూ నాలుగాకులు. పల్చటి సెల్లో పేపర్లో సూదుల్లాంటి ఆకుపచ్చని ఆకుల మధ్య ఠీవిగా, నిటారుగా, హుందాగా, అందంగా వుంటుంది ఆ పువ్వు.

స్కూలు అయిపోయాక పూలు అమ్మే కరీంభాయ్ దగ్గర ఓ అరగంట పన్జేస్తూంటాను. కరీంభాయ్ కట్టి వుంచిన పూల పొట్లాలని అందరి ఇళ్ళల్లో ఇస్తూంటాను.

మొదట్లో పాపం పెద్దాయన కదా అని సాయం చేసినట్లుగా నా అంతట నేనే మనస్ఫూర్తిగా అందరిళ్ళల్లో ఇచ్చేదాన్ని. నా ఉత్సాహం చూసి నాకు నెలకు వందరూపాయలు ఇవ్వడం మొదలెట్టాడు. ఇంకో ఏభై నాన్నదగ్గర తీసుకుని స్కూలు ఫీజు కట్టేసేదాన్ని.

ఆ పువ్వు కింద కార్డు ఏమీలేదు. పేరు కూడా లేదు. అదే కరీంభాయ్‌ని అడిగాను.

ముక్కుమీదకి జారిపోయిన కళ్ళజోదుని పైకి తీసుకోకుండానే కళ్ళు పైకెత్తి చూశాడు. "దానికి కార్డుండదు. ఆమెకి ఎవరు పంపుతున్నారో వాళ్ళు తమ పేరుని రహస్యంగా ఉంచమన్నారు. అందుకని, నువ్వూ ఈ పువ్వు గురించి ఎవరితోనూ ఎక్కడా మాట్లాడకు. నిశ్శబ్దంగా ఆమెకిచ్చేయ్యాలి... ఠీక్ హై..."

ప్రతీ గురువారం పచ్చగులాబీని సంధ్యక్క కివ్వడానికి ఒప్పుకున్నాను. ఆమె ఒక్కత్తే వుంటోంది. ఆమె పెళ్ళి చేసుకుందామనుకున్న సుధీర్, వేరే అమ్మాయి (పేరు శ్రావణి)ని పెళ్ళిచేసుకుని ఆ కాంప్లెక్స్‌కి తీసుకొచ్చాడు. ఆ కాంప్లెక్స్‌లోని అందరూ కూడా అనుకున్నారు సంధ్యా, సుధీర్ పెళ్ళిచేసుకుంటారేమోనని. కానీ, హఠాత్తుగా సుధీర్ శ్రావణిని చేసుకోవడం, తీసుకురావడంతో అందరికీ సంధ్యమీద ఒకలాంటి జాలి కలిగింది.

"మీ మొగాళ్ళంతా ఇంతే..." అంది అమ్మ.

"అందంగా వున్న పిల్లని పెళ్ళిచేసుకోవాలని అనుకోవడంలో తప్పేంలేదు" నాన్న అన్నారు.

శ్రావణి అందం, ఉద్యోగం, జీతం ఏదీ కూడా ఆ కాంప్లెక్సులోని వాళ్ళకి సంతోషాన్నివ్వలేదు. పైగా ఆమెను వ్యంగ్యంగా, ఇన్‌డైరెక్ట్‌గా అనడంలో సంతోషపడ్డారు. అయితే శ్రావణి మాత్రం ఎవరెన్ని అనుకున్నా, ఏమీ పట్టించుకునేది కాదు, వాళ్ళ మాటల్ని విననట్లుగా వుండేది.

"సుధీర్ పెళ్ళి సంధ్య సున్నిత మనసుని నలిపేసింది. ఆ పిల్ల మామూలు మనిషవడం కష్టం. రోజూ పాడే పాటలు అదీ వినిపించడంలేదు" అని అమ్మ నాన్నతో అన్నప్పుడు విన్నాను. అది నిజమే, సంధ్యక్క చక్కగా పాడుతుంది. వయొలిన్ వాయిస్తుంది. ఓ మూడు నెలలనుంచి ఆ స్వరాలు మూగబోయాయి. ఇంట్లోంచి బయటికి రావడమే మానేసింది. స్కూల్లో సంగీత పాఠాలు మానేసింది.

సంధ్యక్క మరీ అందగత్తె కాదు. ఆమె ఇల్లు దాటకుండా, తన ఇంట్లో తనే బందీగా మారిపోయిన ఆ సంధ్యక్క ఇంటికి గులాబీపువ్వుని ఇవ్వడానికి మొదటిరోజున వెళ్ళి బెల్ నొక్కాను.

ఇంటిముందు చీకటిగా వుంది. ఆమె నలిగిపోయిన దుస్తుల్లో, తైలసంస్కారం లేకుండా విరబోసుకున్న జుట్టుతో భయంకరంగా ఉంది. తలుపు కొంచెం తీయగానే పువ్వుని ఆమెచేతిలోవుంచా. పువ్వుని చూసింది.

"పువ్వా! నాకా!" ఆశ్చర్యంగా నా వైపు, పువ్వువైపు చూసి, "నాకేం అక్కర్లేదు..." ఇంట్లోనే ఓ మూలకి విసిరేసింది. రెండో గురువారం చీకటిపడ్డాక అదే టైము - ఏడున్నరకి వెళ్ళి ఇచ్చాను. పువ్వు తీసుకుని, దభీమని నా మొహంమీదే తలుపు వేసింది. మరో గురువారం గడిచింది. తలుపుని నెమ్మదిగా వేసింది.

నాలుగో గురువారం పువ్వు ఇవ్వడానికి వెళ్ళినప్పుడు బెల్ నొక్కగానే తలుపు కొంచెం పెద్దగా తెరిచింది. మొహంలో చాలా మార్పు. తల దువ్వుకుంది. మొహంలో చిరునవ్వు. దుస్తులు కూడా బావున్నాయి.

మరో రెండు వారాలు గడిచాయి. పువ్వు ఇవ్వడానికి వెళ్తే, నన్ను కూచోపెట్టి వయొలిన్ వాయించింది. నాకు సంగీతం గురించి ఏమీ తెలీదు. కానీ ఆమె వాయిస్తూంటే ఆమెనే అలా చూస్తూ వుండిపోయాను.

చెంపకి దగ్గరగా నల్లటి జుట్టు పాయలమీద గులాబి పచ్చగా, చందమామలాగా అందంగా వుండడం గమనించాను. ఫర్వాలేదు. గులాబీని తల్లో పెట్టుకుందే... అని అనుకున్నాను.

కొత్త సంవత్సరానికి ఫ్లాట్లల్లో వాళ్ళంతా ప్రోగ్రాంలు పెట్టారు. ఆటలూ, పాటలూ, డ్యాన్సులూ. మొట్టమొదటి ప్రోగ్రాం సంధ్యక్కపాట, వయొలిన్ కచేరి.

ఈ ప్రోగ్రాంలకు సుధీర్, శ్రావణీలు కూడా వచ్చారు. ముందువరుసలో కూచున్నారు. సంధ్యక్క వాళ్ళిద్దర్నీ గమనించిందో లేదో నాకు తెలీదు.

కానీ చాలా బాగా పాడింది. కళ్ళు మూసుకుని పాడింది, వాయించింది. శ్రావణిని ఇన్‌డైరెక్ట్‌గా ఎవరో ఏదో ఒకటి అంటూనే వున్నా ఆమె పట్టించుకోలేదు. కానీ, నిశ్శబ్దంగా ప్రోగ్రాంలు అన్నీ చూసింది.

"ఫర్వాలేదు. సంధ్య మామూలు మనిషైంది. పూర్తిగా నేలవరకూ జారిపోయిన సంధ్య, ఓడిపోయాననుకున్న సంధ్య పూర్తిగా లేచి, నిటారుగా నుంచుంటోంది" పక్క ఫ్లాటులోని ఆంటీ అమ్మతో చెప్తూంటే విన్నాను.

"స్కూల్లో సంగీత పాఠాలు చెప్పడం మొదలెట్టింది. అలా వెళ్తూంటే ఆమె నడకలోని ఠీవి, హుందాతనం అదీ గమనించారా! మారింది ఫర్వాలేదు" అని ఆ కాంప్లెక్సులో వాళ్లనుకుంటే విన్నాను.

"నిజమే సంధ్య జరిగిపోయినదాన్ని మరిచిపోయింది. పాత సంధ్యలాగా అయిపోయింది. ఇక ఇప్పుడు ఎంతమంది శ్రావణీలు వచ్చినా సంధ్య వాళ్ళముందు ఓ పర్వతంలా తొణకకుండా, బెణకకుండా, చలించకుండా నుంచోగలదు" అని ఇంకో ఆంటీ అంది. నాకు వాళ్ళ మాటలు పెద్దగా అర్థం కాకపోయినా, కానీ, ఒక్కటి మాత్రం నిజం... సంధ్యక్కలోని మార్పుకి అందరూ సంతోషించారు.

నా పదో తరగతి పరీక్షలైపోయాయి. నాన్న ఇంక చదివించలేనని అన్నారు. ఇంటరు చదువు కూడా ఖరీదే. అమ్మకి షుగర్, నాన్నకి బీపీ, నాయనమ్మకి అన్నిరకాల మందులు. దగ్గర్లో వున్న ఆస్పత్రిలో ఏదో ఉద్యోగం చేస్తే, నా తర్వాత చదువుతున్న ఇద్దరు తమ్ముళ్ళ చదువు వెళ్ళిపోతుందని అమ్మా, నాన్న ఇద్దరూ అన్నారు.

అయితే, బాబాయి నన్ను ఇంటరు చదివిస్తానని, వాళ్ళ ఊరు రమ్మనమని ఫోన్ చేశారు. ఇంటరు అయ్యాక నర్సింగ్ కోర్సులో చేరవచ్చు అని కూడా అన్నారు.

గుంటూరు వెళ్ళడానికి, బాబాయి దగ్గర చదువుకోవడానికి దృఢంగా నిశ్చయించుకున్నాను నేను.

ఆ విషయం చెప్పడానికి సంధ్యక్క ఇంటికెళ్ళాను.

ఫ్లాటుముందు లైటు వెలుగుతోంది. తలుపు తీసి, పువ్వుని తీసుకుంది. "నేను రేపట్నించి రాను. ఇంటరు చదవడానికి గుంటూరు వెళ్తున్నాను. కరీంభాయ్ మీకు రోజూ పువ్వు పంపుతానని అన్నాడు..." అని చెప్పాను.

ఓ నిమిషం పాటు అలాగే గుమ్మం దగ్గర నుంచుని, ఆలోచించి నన్ను లోపలికి రమ్మంది.

"కూచో... ఇప్పుడే వస్తాను..." లోపలికి వెళ్ళింది.

కొన్ని కొత్త, పాత డ్రెస్సులున్న ఓ షాపింగ్ బ్యాగ్ని, ఓ పెన్నుని, కొన్ని వందరూపాయలున్న ఓ చిన్న కట్టని నా చేతిలో పెట్టింది. తెల్లబోయి ఆమెనే చూస్తుండి పోయాను.

నేనిచ్చిన గులాబీ పువ్వుని చేతిలో ఉంచుకుంది.

"నీకు తెలీదు మమతా, నీకు తెలీకుండా నన్నో మనిషిని చేశావు" అంటూ గులాబీని కాడతో ఊపుతూ, చెంపకి ఆనించుకుంది.

"నాలాగే ఇది కూడా ఒంటరిదే. ఒంటరిగా వుంటూ కూడా ఇతరులకి ఎంతటి మానసికానందాన్ని కలిగించవచ్చో ప్రాక్టికల్గా చూపించింది.

నా గూడులో నేను ముడుచుకుపోతూంటే నన్ను తట్టింది, లేపింది, లేవదీసింది.

దీనికి నోరులేదు. అయినా దాని మౌనభాషలోనే నాకెన్నో విషయాలు చెప్పింది. నాలో మార్పును తెచ్చింది. నన్ను మార్చింది. గాయనిగా, ఓ కళాకారిణిగా చచ్చిపోతున్న నాకు మోహినీ అవతారాన్ని ఎత్తి అమృతభాండాన్ని కానుకగా ఇచ్చింది. నన్ను బతికించింది. నాకు తెలియకుండానే గురువారం కోసం, నువ్వు తెచ్చే పువ్వు కోసం ఎదురు చూసేలా చేసింది. నోరు విప్పి చెప్పని ఈ పువ్వు గురించి, దీని మహత్యం గురించి ఇంతకన్నా ఏం చెప్పను?"

తల ఊపి... "బాగా చదువుకో...." అంది.

✧ ✧ ✧

ఆ మర్నాడే గుంటూరుకి వెళ్ళిపోయాను. ఆ తర్వాత ఓ ఏడాది దాటాక ఇంటికొచ్చాను. ఎన్నో కాంప్లెక్స్లొచ్చాయి. ఇండిపెండెంట్ ఇళ్ళూ వచ్చాయి.

కరీంభాయ్ దుకాణం అలాగే ఓ చిన్నటేబుల్, చిన్న కుర్చీతో వుంది. సాయంత్రం కరీంభాయ్ దగ్గరకెళ్ళాను. ఇంకా చురుగ్గా పూలమాలలు కడుతున్నాడు.

రకరకాల పూలసంచుల్ని ముందుంచుకుని, ముక్కు మీదకి జారిపోయిన కళ్ళజోడు పైనుంచి చూసి బోసినవ్వు నవ్వాడు. ఓ ఐదు నిమిషాలు మామూలు మాటలు మాట్లాడుకున్నాం. ఆ తర్వాత ఆయనను అడిగాను.

"నేను... ప్రతీ గురువారం ఓ గులాబీ పువ్వుని ఇచ్చే దానిని కదా... సంధ్యక్కకి. ఆ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్లలో వుండేది..." అంటూ గుర్తు చేశాను.

నవ్వాడు. "గుర్తుంది పాపా. బాగా గుర్తు... ఆమెకి ఓ సంగీతం ఆయనతో పెళ్ళయింది. గణపతి నవరాత్రులలో రోజూ ఇద్దరూ కలిసి కచేరీలు చేశారు..." నాక్కావలసిన విషయం రాలేదు. సంకోచిస్తూనే అడిగాను.

"సుధీర్‌బాబు సంధ్యక్కని పెళ్ళి చేసుకుంటాడేమో అని అందరూ అనుకున్నారన్న సంగతి శ్రావణక్కకి తెలుసా! ప్రతీవారం ఓ గులాబిపువ్వుని పంపేవాడని ఆమెకు తెలుసా..." అన్నాను కరీంభాయ్‌తో.

నేను చెప్తున్న మాటలు ఇంకా పూర్తికాకుండానే ఆగమన్నట్లు చెయ్యి ఊపాడు కరీంభాయ్.

"చిన్నదానివి నీకు తెలీదు. కానీ అసలు సంగతి చెప్తాను. అసలు ఆ పువ్వుల సంగతి సుధీర్‌బాబుకి తెలీనే తెలీదు. ఎందుకంటే, సంధ్యకి పూలు పంపమని ఆయన చెప్పలేదు, ఆయన పంపించలేదు..."

ఆశ్చర్యంగా కరీంభాయ్‌ని చూశాను.

"మరి... మరి... వాటిని సంధ్యక్కకి ఎవరు పంపారు?" మొహం, చేతులు తిప్పుతూ అడిగాను.

అటూ ఇటూ చూసి, "ఎవరికీ చెప్పకు... సుధీర్‌బాబు శ్రావణిని పెళ్ళిచేసుకుని, భాగ్యనగర్ అపార్టుమెంట్‌కు తీసుకొచ్చాక... సంధ్య స్కూల్లో ఉద్యోగం మానేయడం, తనకు తానే తలుపులేసుకుని తన ఇంట్లో తనకు తానే బందీ అయిపోవడం, కృశించిపోవడం, ప్రేమలో ఓడిపోయి, జీవితంలోనే ఓడిపోయానని అనుకుని, తనకు తానే శిక్షలు వేసుకుంటూంటే చూడలేక, ఆమెకి ప్రతీ గురువారం ఓ పువ్వు పంపమని చెప్పింది. ఆ తర్వాత... సంధ్య పెళ్ళయిపోయాక పంపవద్దని అంది..."

మళ్ళీ ఆశ్చర్యం వేసింది. అదే ఆశ్చర్యంతో అడిగాను, "ఎవరూ? త్వరగా చెప్పు" అని.

"శ్రావణి.. సుధీర్‌బాబుకీ బీవి.... చాలా మంచిది. మంచి మనసున్న మనిషి..." అన్నాడు.

ఈ సంఘటన నేను పదోతరగతిలో ఉన్నప్పుడు జరిగింది. ఇంటరు మొదటి సంవత్సరంలో పూర్తి అయిపోయింది. కానీ, నా మనసులో అయిపోలేదు. అందుకే నేను మర్చిపోలేదు. ఆ గులాబి పువ్వు థెరపీని నేను పెద్దయ్యాక, నర్సుగా ఉద్యోగంలో చేరాక, రోగులకి, స్నేహితులకి ఇవ్వడం మొదలెట్టాను. బ్రహ్మాండంగా పనిచేసింది... అని నేను ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

*స్వాతి వారపత్రిక, 28 ఆగస్టు 2009*